# శ్రీ రమణ జ్యోతి / Sri Ramana Jyothi

ఫిబ్రవరి 2019 / February 2019

ఈ సంచికలో ... / IN THIS ISSUE ...


| | | | |
|---|---|---|---|
| 1. | డా॥ కే.యస్. గారి 56వ ప్రవచనం | తాడిమేటి సత్యనారాయణ | 3 |
| 2. | రమణ తత్త్వము - మౌన సాధన | దోనెపూడి వెంకయ్య | 11 |
| 3. | శ్రీరమణ మహర్షియొక్క భక్తాగ్రేసరులు | కాట్రావులపల్లి సుబ్బలక్ష్మి | 14 |
| 4 | శూన్యం నుంచి సృష్టి | ధూళిపాళ చంద్రశేఖర శాస్త్రి | 20 |
| 5. | రమణగీతం | యనమండ్ర సంధ్యాదేవి | 25 |
| 6. | నమ్మకం, విశ్వాసం | డా. వి. రామదాస్ మూర్తి | 26 |
| 7. | **The Wisdom of Bhaja Govindam** | Dr.K.Subrahmanian | 30 |
| 8. | **The Secret of Guru** | K. Lakshmana Sarma | 34 |
| 9. | **Periapuranam, The Crest Jewel of Bhakthi Literature** | | 39 |
| 10. | **The Glory of Sri Ramana - Kavyakantha's Sri Ramana Chatvaarimsat** | V. Krithivasan | 43 |
| 11. | **The Serpent and the Self** | Sneha Choudhury | 48 |
| 12. | **Invitation to Death** | D. Samarender Reddy | 51 |


## Events in Sri Ramana Kendram in February

1. Satsang - Every Sunday - 9.00 - 10.45 a.m.
2. 3rd Sunday - Meditation - 9.00 - 10.45 a.m.
3. 17th February: - Punarvasu Satsang - 6.00 - 7.15 p.m.

శ్రీ రమణజ్యోతి వ్యవస్థాపకులు : కీ॥శే॥ డా॥ కె. సుబ్రహ్మణియన్
(వ్యవస్థాపక అధ్యక్షులు, శ్రీరమణకేంద్రం)

# మనోరహిత స్థితియే ఆనందము

ఆంగ్ల మూలం: డా॥ కే.యస్. గారి 56వ ప్రవచనం

తెలుగు అనువాదం: తాడిమేటి సత్యనారాయణ

(ఈ వ్యాసం డా. కె.ఎస్.గారి 55వ ప్రవచనానికి తరువాయి భాగంగా భావించి, పాఠక భక్తులు చదువగలరని ప్రార్థన - ఎడిటర్)

దీర్ఘ నిద్రలో మనస్సు లేదు. అక్కడ మనము అనుభవించే సుఖాన్ని మేల్కొన్న తర్వాతే గుర్తించగలుగుతున్నాము. మెలకువలో ఎన్నో జరుగుతున్నాయి. అవి మనకు తెలుసును కూడా. అది నిజమేనా కాదా యని హేతుబద్ధం చేయగలుగుతున్నాము. మెలకువలో మనస్సు చురుకుగా వుండి పనులు చక్కగా చేసుకోగలుగుతున్నాము. కనుకనే ఈ అవస్థ నిజమయినదనీ, ఇతర అవస్థలు నిజం కాదని నమ్ముతున్నాము. ఉదాహరణకు, తలుపు మూస్తున్నప్పుడు అనుకోకుండా ఒక బాలుని వ్రేలికి గాయం తగులుగుతుంది. బాలుడు విపరీతమయిన నొప్పితో ఏడుస్తాడు. మనం ఏం చేస్తాము? పసివాణ్ణి శాంతింపజేయడానికి, తలుపును శిక్షిస్తున్నట్లు దానిని కొడతాము ఆ పిల్లవాని ఎదుట - తృప్తితో ఆ పసివాడు ఏడుపు నిలిపి వేస్తాడు. ఒక్కొక్క తడవ బాలుడు నవ్వుతాడు కూడా. ఇక్కడ నిజమేది? బాలుని దృష్టిలో తలుపు శిక్షించబడింది. మన దృష్టిలో తలుపును శిక్షించలేమని మనకు తెలుసు. కేవలం ఆ పసివానిని తృప్తిపరచడానికే ఈ విధంగా నాటకమాడుతాము. బాలునికి అది నిజము, మనకు అది నిజం కాదు, కేవలం ఒక నాటకము. ఇది లోక సహజం.

ఇందు సత్యమేది? అసత్యమేది? పెద్దవారు మరొక పెద్ద వారిని ఈ విధముగా తృప్తి పరచలేరు. వాస్తవంగా కొన్ని స్థాయి

లున్నాయి, పసివాని దృష్టిలో ఏది వాస్తవమో అది వాస్తవం కాదు. అయినా తెలిసి వానిని తృప్తిపరచడానికి ఈ పని చేస్తున్నాము. అట్లాగే తాతగారి వీపుపై ఎక్కి గుర్రపు స్వారీ చేస్తాడు మనుమడు, గుర్రంలాగ పరుగెత్తమని తాతగారిని తోలడానికి యత్నిస్తాడు. అలాగే నంటారు తాతగారు. తాతగారు ఎంతో ఆనందిస్తారు, పసివాని దృష్టిలో తాతగారు ఒక గుర్రం. తాతగారిని తోలుతాడు. తాతగారు పసివాని మొఖంలోని ఆనందాన్ని చూసి తానూ ఆనందిస్తాడు. తాత గారికి ఆ ఆట నిజం కాదని, తాను గుర్రం కాదని తెలిసినా, పసివాని కోసం ఆయన ఒక మెట్టు క్రిందకు దిగుతాడు. అదే ప్రక్కింటి అబ్బాయి అడిగితే తాతగారు ఒప్పుకుంటాడా? బదులుగా కోపం రావచ్చు. ఆ అబ్బాయిని తిట్టవచ్చు. ఇక్కడ రెండు స్థాయిలు వున్నాయి. మనుమని ఆనందానికి తాతగారు ఏమైనా చేస్తారు. అతని ఆనందమే తన ఆనందం. మనుమనితో తాను గుర్రం కాదని తాతగారు చెప్పవచ్చు. కాని చేయలేరు. కారణం మనుమని ఆనందం, సంతోషమే ముఖ్యం. ఒకవేళ మనుమడు పన్నెండు సంవత్సరాల వాడయితే, తాతగారు నిరాకరిస్తారు. అంతేకాదు. మనుమడి వైఖరి ఇలా ఉన్నదే యని చింతిస్తాడు. వైఖరి అసహజం అనిపిస్తుంది. బాధపడతారు. కనుక వేర్వేరు పరిస్థితులలో వేర్వేరు కొలబద్దల నుపయోగిస్తారు. అసలు వాస్తవమైన కొలబద్ద అంటూ ఏదీ లేదు. వయస్సు పెరిగే కొద్దీ వచ్చేటువంటి మార్పులు ఇవన్నీ.

మనం ఇంకా ఎన్నో చేస్తాము. ఒక జ్ఞానిని, లేదా ఒక సాధువును దర్శించి కోర్కెలు తీర్చమంటాము. కోరినవి లభిస్తే సంతోషించి ఆ సాధువు ఎంత గొప్ప మహానుభావుడోయని



కీర్తిస్తాము. ఇవేనా జీవితంలో ముఖ్యమైనవి? మనం పెద్దవార మయ్యాము, ఇల్లు, ఉద్యోగం, సంసారం, సంతానం, సమస్యలు ఇవే జీవితం. భగవంతుని ఎన్నో కోరుకొంటాము. ఈ దశను కూడా మనిషి దాటాలని భగవంతుడు వాంఛిస్తాడట. అనుభవాలన్నీ మనకు నేర్పేవి ఒక్కటే. "భగవంతుడా! అడిగినవన్నీ ఇస్తావు. నాకు సంతోషంగా వుంది. నీకు ఋణపడి వుంటాను. ఈ కోరికలకు అంతే లేదు. సంతృప్తి లేనే లేదు. నేను కోరుతూనే వుంటాను, నీవు తీరుస్తూనే వుంటావు. కారణం మనస్సు. అది నిరంతరం ఏదో కోరుతూనే వుంటుంది. వీటి నుండి నేను విడివడా లనిపిస్తుంది" అనుకొంటాడు.

ఏ కోర్కెలు లేని నిద్రలో ఎంతో సుఖంగా, ఆనందంగా ఉన్నాము అనిపిస్తుంది. మనస్సు లేకపోతే మిగిలేది ఆనందమే. ఈ మాటే భగవాన్ చెబుతారు, కాని మనస్సు నుండి మనము విడిపడగలమా? అసలు మనస్సనేది ఒకటి ఉందా అని భగవాన్ అంటారు. భగవాన్ బోధ ఇదే. మనస్సు అంటే తలపుల మూట అని. తలపులు లేకుండా ఉండగలమా? మెలకువలో మనిషిని బాధించేవి ఈ ఆలోచనలే కదా! ఒకరు నిద్రలో ఎట్లాగ ఆనందంగా ఉన్నారో, మెలకువలో కూడా అట్లాగే ఉండవచ్చు అని భగవాన్ బోధిస్తారు. ఇది వీలవుతుందా? మార్గం ఏదైనా ఉందా?

కొన్ని సూచనలున్నాయి, ఒకటి మనము తెలుసుకోవలసిన దేమంటే ఎవరికి వారే ఆ మార్గాన్ని కనుక్కోవాలి. ఋషులు, యోగులు కొన్నిటినే సూచించారు. కాని అవి ఒక పద్ధతి ప్రకారం అనుసరించవలసిన విధానాలు కావు. సత్యాన్వేషణకు మనం ఒంటరిగానే పయనించాల్సిందే. అది ఎలాగ? దానికి కావలసిన

సౌకర్యాలు ఏమిటో మనమే నిర్ధారించుకోవాలి. ఇది కేవలం మనము స్వయంగా తీసుకోవలసిన నిర్ణయం. పురాణాలు, వేదాలు ఘోషించేవి ఇవే. "నేను ఈ మార్గంలో వెళ్లాను. నా అనుభవము ఇది" అని ఋషులు చెప్పారు. "కావాలంటే నీవు ప్రయత్నించు". వారి బోధ ఒక్కొక్కమారు మనకు తెలియ కుండానే గమ్యాన్ని చేరుతాము. భగవాన్ అనుభవమే దానికి ఉదాహరణ. భగవాన్ ఏ మార్గాన్ని అనుసరించకనే గమ్యాన్ని చేరారే! అదే మార్గంలో మనలను కూడా వెళ్లమంటున్నారే. ఇది సరేనా? దీనికి సమాధానం లేదు. "అరుణాచలుడు నేను అడగ కనే నాకు ఇది ఇచ్చారే" అని భగవాన్ అన్నారు. కనుక మనము నిర్ణయించుకోవటము కాదు. మనం ఎన్నుకొనడం కాదు. భగవంతుడే మనలను ఎన్నుకొనాలి. ఎందుకు భగవంతుడు ఒకరిని ఎన్నుకొన్నారు? అతని పాండిత్యమా? ఇదా? మరొకటా? ఏమిటి? సమాధానం లభించదు.

భగవాన్ కొన్ని సూచనలిచ్చారు. ఇది చాలా ప్రత్యేకమయిన సూచన, అపూర్వమయిన సూచన అని ఆయన చెప్పలేదు, ఫలానా గ్రంథంలో ఇలాగ చెప్పబడింది అన్నారు అంతే. వారి మార్గం అత్యంత మౌలికమయినది అని చెప్పలేదు. కాని వారి ఇరవై యొకటవ సంవత్సరంలో, శివ ప్రకాశం పిళ్లై అనే భక్తుడు వ్రాసి ఇచ్చిన అనేక ప్రశ్నలకు సమాధానమే "నేనెవరు?" అనే చిన్న గ్రంథము నిచ్చారు. ఇదొక్కటి చదివితే చాలు అంతా తేటతెల్లమవుతుంది. 21 సంవత్సరాల ప్రాయంలో ఉన్న భగవాన్ ఏ గ్రంథాలు, ఉపనిషత్తులు, వేదాలు చదువలేదు. తర్వాతి కాలంలో ఎవరో ఈ గ్రంథాలు ఇస్తే తన అనుభవమే ఆ గ్రంథాలలో



వున్నవని చెప్పారు. మనం బ్రహ్మమును గూర్చి గ్రంథాలలో చదువుతాము, కాని దాని అనుభవం లేదు.

భగవాన్‌కు బ్రహ్మమంటే ఏమిటో తెలుసు. ఆ జ్ఞానము గ్రంథాలను చూసిన తర్వాత దృఢ పడింది. అటుపై భగవాన్ భక్తులకు చెప్పినది ఇలాగ అర్థం తీసుకోవచ్చును. దేవుడున్నాడా, లేడా అనే ప్రశ్నలను ప్రక్కన బెట్టి, నీవు ఏమి చెబుతున్నావో, ఏమి చేస్తున్నావో దానిపై దృష్టి సారించు అన్నారు. దీని వలన ప్రతి క్షణం వ్యక్తి ఎరుకలో వుండగలుగుతారు. ఇది సులభమని పిస్తుంది కాని కష్టమే. ఇట్లాగ చేయగలిగితే మనం చేసేది, మాట్లాడేది ఒక పద్ధతిగా వుంటుంది. బుద్ధుడు ఈ విషయాన్నే ఇట్లాగ చెప్పారు. కూర్చొని నీ శ్వాసపై అంటే ఉచ్ఛ్వాస, నిశ్వాసాలపై దృష్టిని పెట్టాలి. నిజానికి ఇది చాలా ముఖ్యమైన విషయం మనిషి జీవితంలో. మనం ప్రతి క్షణం ఊపిరి తీసుకొంటూనే ఉన్నాము. కాని మనకు తెలియటం లేదు. 24 గంటలు ఈ ప్రక్రియ మనలో జరుగుతూనే వుంది. దానిని ఎరుకతో గమనించాలి. బుద్ధుడు ఇంకా ఇలాగ చెప్పారు. నిదానంగా నడక సాగించాలి. వేసే ప్రతి అడుగునూ గమనిస్తూ ఉండమన్నారు. మనం ఊపిరిని గమనిస్తూంటే, చేసే ప్రతి పని మీద ఎరుక గలిగి వుంటాము. ఇట్లాగ అనుసరిస్తూంటే చివరకు మిగిలేది ఎఱుక మాత్రమే. అక్కడ కర్మలు చేసే వ్యక్తి ఉండడు.

మనం ఎఱుకను గురించి ప్రస్తావిస్తున్నాము. కారణం ఎఱుకను గురించి మనకు కొంచెమే తెలుసు. ఎవరు ఎఱుకని పూర్తిగా తెలుసుకుంటారో వారు కేవలం ఎఱుకగానే మిగులు తారు తప్ప అక్కడ వ్యక్తి వుండడు. భగవాన్ బోధనలను చదివితే

వారు "నేను మరచి పోయాను" అని ఎప్పుడూ చెప్పలేదు అని తెలుస్తుంది. జ్ఞాపకము, మరుపులు ఎక్కడుంటాయంటే, ఒక దానిపై తక్కువ దృష్టి, మరొకదానిపై ఎక్కువ దృష్టి వున్నప్పుడే. ఎఱుకలో హెచ్చుతగ్గులుండవు. ఎఱుక ఎప్పుడూ సంపూర్ణమే. భగవాన్ ఉపదేశసారంలో మరొక విధంగా ఇలా

**వాయురోధనాత్ లీయతే మనః**

**జాల పక్షివ ద్రోధ సాధనమ్** అన్నారు.

ఎప్పుడూ ఎఱుకలో ఉండు అని బుద్ధ భగవానుడు బోధించాడు. నీవు శ్వాసను నియంత్రిస్తే, మనస్సు కూడా నియంత్రణలో ఉంటుంది. శ్వాసకు, మనస్సుకూ మూలం ఒకటే. ఒక దానిని నియంత్రిస్తే రెండవది కూడా నియంత్రించబడుతుంది. దీనినే భగవాన్ ధృవపరచారు కూడా.

ఉదయం మేల్కొనగానే పడక నుండి హడావిడిగాదిగవద్దన్నారు భగవాన్. అట్లే కూర్చొని ధ్యానించమన్నారు. శ్వాసపై దృష్టి మంచిదే అన్నారు. కాని ప్రారంభంలో నిరుత్సాహపడనక్కర్లేదు. శ్వాసపై దృష్టి కేవలం కొద్ది సమయమే వీలవుతుందని కొందరు చెప్పవచ్చును. ప్రారంభంలో కొద్ది సేపు ఉండడమే గొప్ప విషయము, అటుపై మెల్లమెల్లగా సమయాన్ని ఎక్కువ చేయవచ్చును. నిద్రనుండి మేల్కొనగానే ఆత్మలో లీనమయిన మనస్సు తిరిగి పుడుతుంది. కనుక అపుడే ఎఱుక కలిగి మనస్సును ఆత్మలో లయం చేయమంటారు భగవాన్. ఒకమారు మనస్సు లోక వ్యవహారాలలో మునిగినదంటే మళ్లీ దానిని వెనుకకు మళ్లించడం కొంచం కష్టమే. కనుక మేల్కొనగానే ధ్యానమగ్నులై ఉండాలంటారు భగవాన్. శ్వాస ప్రక్రియను కూడా



చేబట్టవచ్చునని కూడా సూచిస్తారు. దైవానుగ్రహం వుంటేనే శ్వాసపై ఎక్కువ సమయం దృష్టి పెట్టగల్గుతాము. అభ్యాస మయితే ఎంతో సులువనిపిస్తుంది.

"మీరు సులువు అని అంటారు. కాని నేనెప్పుడు సాధించ గలను?" అని సాధు నటనానంద భగవానులను ప్రశ్నించారు. "ఎప్పుడు నీవు ఈ లోకం నుండి ఎట్టి వాంఛలు లేక, ఎట్టి సుఖాలను ఆశించక వుంటావో, ఆ క్షణమే సాక్షాత్కరిస్తుంది" అన్నారు భగవాన్. తిరిగి నటనానంద భగవానులను ప్రశ్నించారు. "అయితే నాకు అది సిద్ధిస్తుందంటారా?" అని. అపుడు భగవాన్ సమాధానం ఒక అసాధారణమయినది. "ఎందుకు సందేహిస్తావు? ఆ విశ్వాసమే లేకపోతే నా దగ్గరకు వచ్చి వుండేవానివి కావు" అన్నారు. ఎంతో స్పష్టంగా పూచీనిచ్చారు నటనానందులకు భగవాన్. మనం దేనిని అనుసరించాలో దానిని అనుసరించాలి. మిగిలినది అది చూసుకొంటుంది అన్నారు భగవాన్. ఇంకా ఇలా అన్నారు: సాధన కాలంలో నీకు ఎన్నో ఎన్నో జరుగవచ్చు. వాటి వలన ప్రభావితం గాకుండా జాగ్రత్త వహించాలి. కొందరికి శక్తులు, కొందరికి దృశ్యములు, కొందరికి వెలుగూ కనిపిస్తాయి. ఇవన్నీ సాధకుల దృష్టిని మరలిస్తాయి. ఇలాంటివి జరిగితే "ఇవి ఎవరికి కలిగాయి?" అని ప్రశ్నించాలి. మనం ఇతరుల కంటె ఎక్కువ సాధించామని గర్వపడకూడదు, గర్వపడితే భంగం తప్పదు. కనుక శ్వాసపై దృష్టి, బుద్ధుడు, భగవాన్ చెప్పినట్లు, పెడితే మనస్సును స్వాధీనంలో వుంచగలుగుతాము. మనస్సును ఎలాగ నియంత్రించాలో దానికి అనేక మార్గాలను సూచించారు, వీటిని మరొకమారు చర్చించుకుందాము.

ఇక ఆసనాల గురించి అంటారా! ఎందరికో ఎన్నో సందేహా లున్నాయి. ఎవరు వీటి గురించి ప్రశ్నించినా భగవాన్ సమాధానం ఒక్కటే: సుఖాసనం. ఏ ఆసనం సుఖమో దానిని ఎంచుకో అంటారు. నేలపై కూర్చొనటం కష్టమనిపిస్తే కుర్చీలో కూర్చోవచ్చు అంటారు భగవాన్. సుఖంగా కూర్చోవాలి అది ముఖ్యం అన్నారు. సుఖం లేకపోతే దేని మీదా ఏకాగ్రత కుదరదు. ప్రారంభ దశలో శరీరాన్ని సుఖాసనంలో వుంచి సాధన చేయాలి.

1935లో మేజర్ చాడ్విక్ ఆశ్రమం వచ్చారు, 1960 వరకు ఉన్నారు. భగవాన్ నిర్యాణం తర్వాత కూడా వారు ఆశ్రమాన్ని వీడలేదు. నేలమీద కూర్చోనలేకపోయే వారు. ఏదో విధంగా నేలమీద కూర్చొనడానికి అలవాటు చేసుకున్నారు. ఎట్లాగ? కాళ్లకు ఒక బెల్టు కట్టి మూడు నాలుగు గంటలు కూర్చొనేవారు. ఒకనాడు ఒక బాలుడు హాలులో చాడ్విక్ అట్లాగ విచిత్రంగా కూర్చొనడాన్ని చూసి భగవాన్‌తో, "ఎందుకు మీరు వారిని అట్లాగ కట్టేశారు? ఏం తప్పు చేశారాయన?" అని అడిగాడు. "కుర్చీలో కూర్చొనడానికి ఇష్టపడలేదు వారు. ఆ విధంగా కూర్చోవాలను కొన్నారు" అని సమాధానమిచ్చారు భగవాన్.

విషయమేమంటే ప్రారంభ దశలో కుర్చీలో కూర్చొన్నా, ఎట్లాగ కూర్చొన్నా ఫలానా ఆసనంలోనే కూర్చోమని భగవాన్ చెప్పలేదు. ధ్యానం ముఖ్యం గాని ఎక్కడ అని కాదు. మొదట కూర్చోవడం సుఖంగా ఉండాలి అప్పుడు మనస్సు నిశ్చలమై శాంతి లభిస్తుంది. శాంతి కొద్దిసేపే అయినా చాలా శ్రేష్ఠంగా వుంటుంది. అట్లాగుండ డమంటే భగవదనుగ్రహమేకాని మన సామర్థ్యం కాదు. ఆ మాట కొస్తే చేయాలనుకోవటం కూడా భగవాన్ అనుగ్రహం వల్లనే.



# రమణ తత్త్వము - మౌన సాధన

దోనెపూడి వెంకయ్య

ఆత్మ తత్త్వము మనస్సుకు అందేది కాదు. మాటలకు అందేది కాదు. అందుచేత దానిని గురించి ఊహించలేము. దాన్ని గురించి మాటలలో వివరించలేము. దానిని సూచించటం మాత్రమే సాధ్య మవుతుంది - శాఖా చంద్ర న్యాయంగా అందుకు మౌనము ఒక్కటే శరణ్యము. ఇది భగవాన్ శ్రీరమణ మహర్షి చెప్పిన మాట.

దక్షిణమూర్తి బోధించింది మౌనము ద్వారానే. తలపులు అణిగితే మౌనము ద్వారా ఒకరినొకరు అర్థం చేసుకుంటారు. మౌనము నిరంతర సంభాషణ. అది ఎడతెగని భాషా ప్రవాహం. చాలా ఏళ్ళు చర్చించినా అర్థం కాని విషయం మౌనము ద్వారా లేక ఒక జ్ఞాని యొక్క మౌన సన్నిధిలో ఒక త్రుటిలో అర్థం అవుతుంది. అందుకే మౌనోపదేశమే అత్యంత ఉత్కృష్టమయిన ఉపదేశము.

అలాగే మౌన సాధనయే అత్యుత్తమ సాధన. నిరంతర ధ్యానంలో మునిగిన మనస్సు నుండి మౌనం పుట్టుకొస్తుంది. మౌనమే పరమ శాంతస్థితి. అన్ని వేదాలు, ఆగమాలు బోధించే చరమ సిద్ధాంత సారము మౌనమే. పరమార్థమయిన స్వరూపము ఉజ్జ్వలమై ప్రకాశించే స్థితియే శుద్ధమౌనము. అదే ఆత్మ స్వరూపము. మౌనము సకల బాహ్యామైన అడ్డంకులను నివారించి, సంకల్పముల రణగొణ ధ్వనిని సద్దుమణిగేట్లు చేస్తుంది. మౌనము నిర్వచించరానిది. ఆత్మతత్త్వము మౌనమే.

అది వాక్కు, మనసులకు అర్థం కానిది. పరావాక్కును వినే మార్గము మౌనమే.

మౌనమే ఎంతో కఠినమైన తపస్సు. చిత్త చాంచల్యము అణగేందుకు దారి అదే. శరణాగతి అంటే మౌనమే. మార్జాల కిశోర న్యాయము ఇందుకు దృష్టాంతము. అహంతను వదులు కోవటమే మౌనము. దృఢమౌనము పూజ కాని పూజ. మౌనము అంటే పరావాక్కు ద్వారా ఎడతెగక చేసే స్తోత్రము. మౌనమంటే తైలధారవలె సాగే నిరంతర ఆత్మానుసంధానము.

ఏ సాధన చేతను చావని మాయ మౌనంతో నశిస్తుంది. అందు చేత మౌనసాధనయే అన్నింటికంటె కష్టమైన పని. మౌనమే మోక్షానికి చిట్టచివరి ప్రవేశ ద్వారము. మౌనస్థితియే ఆనంద స్థితి. అదే స్వరూప స్థితి. మౌనము జ్ఞాన తపస్సు. అది సర్వోత్తమ మయిన భాష. అఖండ మౌన భాషలో ప్రశ్నోత్తరాలకు తావులేదు. మౌనము జడస్థితి. అది చైతన్యస్థితి. మిక్కిలి వేగంగా తిరిగే బొంగరపు పై భాగం నిశ్చలంగా తోచినట్లు ఉండే స్థితి. ఇందుకు ఉపమానం. మౌనస్థితిలో ఉండటం అంటే అభేద భేదభావన మరచి స్థిరంగా నిలిచి ఉండటమే. నదులన్నీ సముద్రములో కలిసిపోయినట్లు సకల సాధనా మార్గాలూ మౌనములో కలిసి పోతున్నాయి.

మౌనమయ జీవనమే అనుగ్రహ పూర్ణ జీవనము. ద్వైతం, అద్వైతం అనే సకల మత వాదములు లేని మౌనమే నిజమయిన మతము. సకల శాస్త్రగ్రంథములు, పురాణ ఇతిహాసాలు, మౌనము అనే గ్రంథానికి వ్రాసిన వ్యాఖ్యానములు,



ఉపోద్ఘాతములు మాత్రమే. దివ్య మౌనము ద్వారా బ్రహ్మము యొక్క మాహాత్మ్యము వెల్లడి అవుతుంది, అన్యథా కాదు. మౌనమంటే యేమిటి? అది మనోవ్యాపారములు లేని ధ్యానము. మౌనము నిత్య ప్రసంగము. అదే నిజమయిన వాగ్ధాటి. నిరంతర భాషా స్రవంతి, ఆగని వాక్ప్రవాహం. మౌనము అనర్గళమైన ఉపన్యాసము.

సాధన యొక్క అంతిమ దశలో మాటలు ఆగిపోతాయి, మౌనము రాజ్యమేలుతుంది. మౌనము సహజము, శుద్ధము, అవిచ్ఛిన్నము అయిన ఉపాసన. సదా తన్మయముగా ఉండే స్థితియే మానసిక పూజ.

వాక్కును నిరోధించే రూపంలో ఉండే మౌనమే యోగ ద్వారము. వాఙ్మనము (మాట) ఆ తొందరలోనే చక్షు (దృష్టి), మౌనముగా (మనస్సు), శ్రోతృ (వినికిడి) మౌనముగా మనో (మనస్సు) మౌనముగా పర్యవసిస్తుంది. కళ్లెము నోట్లో పెడితే ఎంత పెంకి గుఱ్ఱమయినా అదుపులోనికి వచ్చినట్లు వాక్కుకు మౌనము అనే కళ్లెము వేస్తే సర్వేంద్రియాలు, మనస్సు, సులభంగా నియంత్రించబడతాయి.

సంస్కృతమును దేవభాష అంటారు. కాని మౌనము దైవభాష, ఆధ్యాత్మిక భాష, ఆత్మభాష మౌనము ఆత్మానుగ్రహస్థితి. అది దైవకృప ఫలితంగా కలిగే స్థితి. భగవాన్ రమణ మహర్షి మౌనభాషా విశారదులు, మౌన వ్యాఖ్యాతలు, మౌన వ్రతము సర్వార్థ సాధక మయిన మహా వ్రతము. నాలుక నిశ్చలంగా ఉంటే హృదయం పూర్ణమౌతుంది. మౌనము ఆత్మస్ఫూర్తి.

# రమణ మహర్షి యొక్క భక్తాగ్రేసరులు
# శాంతమ్మాళ్

- కాత్రావులపల్లి సుబ్బలక్ష్మి

అరుణాచలం లోని రమణాశ్రమంలో భగవాన్ రమణ మహర్షి జయంతి ఏర్పాట్లు జరుగుతున్న సందర్భంలో భగవాన్ సర్వాధికారిని పిలిచి ఆహ్వాన పత్రికను ప్రత్యేకంగా పంపమని చెప్పిన ఒక నిరుపేద, అనాథ వితంతువే శాంతమ్మాళ్. గురువుకు, శిష్యునికి మధ్య గల దూరాన్ని భర్తీ చేయడానికి భగవాన్ తీసుకున్న శ్రద్ధ ఆమెను ఎంతగానో ప్రభావితం చేసింది. దానితో 1928 సం॥లో ఆశ్రమానికి చేరిన ఆమెను చివరి వరకు అక్కడే ఉండేలా చేసింది. ఆమె ఆశ్రమానికి చేరేసరికి భగవాన్ “ఉళ్ళదు నార్పదు” (ఉన్నది నలుబది) అనే గ్రంథ విషయాలను బోధిస్తున్నారు. ఆయన మాట్లాడడం ఆపి ఆమె వైపు తిరిగి, “మీకు దీని కాపీ అందిందా? మీకు దీనిని పంపమని వాళ్ళకు చెప్పాను” అని అన్నారు. ఆ మాటలలోని భగవాన్ కరుణకు, వ్యక్తిగత శ్రద్ధకు చలించిపోయిన ఆమె. “నేను ఈ గురువుగారికి వండిపెడుతూ, ఇక్కడే ఉండిపోతాను” అని మనస్సులో దృఢంగా నిశ్చయించుకున్నారు. అప్పుడు ఆశ్రమంలో భగవాన్ సోదరుడు ‘చిన్న స్వామి’ ముఖ్య వంటవానిగా ఉండేవారు. యాదృచ్ఛికంగా ఆమె అలా ప్రతిన పూనిన మరుసటి రోజునే చిన్నస్వామి కొన్నాళ్ళు చెన్నై వెళ్ళ వలసి రావడంతో ఆశ్రమంలో వంటపని చేసే సువర్ణావకాశం ఆమెకు లభించింది.



ఆశ్రమంలో వంట చేసే స్త్రీలలో శంకరమ్మాళ్, సుబ్బలక్ష్మి అమ్మాళ్, సంపూర్ణమ్మాళ్, లోకమ్మాళ్ మొదలయినవారు భగవాన్‌కు పూర్తిగా శరణాగతి చెంది వంట చేసేవారు. కాబట్టి అందరూ ఆ వంట చాలా రుచిగా వుండేదని చెప్పుకునేవారు. వంటవారితో భగవాన్ అనుబంధం ప్రత్యేకంగా వుండేది. ముఖ్యంగా బాల వితంతువులతో ఒక మిత్రునిలా మెలుగుతూ కలసి మెలసి వుంటూనే గొప్ప పండితులకు చేసే బోధనే వారికి కూడా చేసేవారు. అంతే గాకుండ, తమ బోధలోని ఆధ్యాత్మిక లోతులను వారు గ్రహించేటట్లు చేసేవారు. భగవాన్‌తో కలసి వంట గదిలో పని చేయడం కేవలం వంట చేయడమే కాదు, ఒక విధమైన ఆధ్యాత్మిక సాధనను పొందడమే.

తన భర్తను, పిల్లలను కోల్పోయి అనాథగా మిగిలిన శాంతమ్మాళ్ ఎంతో పేద స్థితిలో ఉన్నందున బంధువుల ఇళ్ళలో వంటలో సాయపడటానికి వెళ్ళేది. ఒక రోజు ఆమె తన బావగారి ఇంట్లో వండుతుండగా అంతరంగంలో ఆమెకు “నువ్వు ఏమి చేస్తున్నావు? ఎందుకు ఈ బాధ్యతలన్నీ నెత్తిన వేసుకుంటావు? నువ్వు ఎవరికి సేవ చేస్తున్నావు? నువ్వు ఎవరివి?” అన్న మాటలు ప్రతిధ్వనించడంతో, దానిని భవిష్యత్తులో రాబోయే గురువు ఆజ్ఞగా భావించి అనుభూతి చెందారు. వెనువెంటనే ఆమె తన బావగారి ఇల్లు వదిలి తన మిత్రులు ఒకరైన ‘మురుగనార్’ ఇంటికి వెళ్ళింది. లోపలికి ప్రవేశిస్తూనే మొదటిసారిగా అక్కడ భగవాన్ ఫోటోను చూసి విస్మయం చెందింది. ఎందుకంటే అది ఆమెను ప్రభావితం చేసి ‘రమ్మని’ పిలిచినట్లు అయింది గనుక. వెంటనే “ఈయనే

నా గురువు, దైవము" అని మనసులో గాఢంగా అనుభూతి చెందింది, దాంతో ఆమెకు అరుణాచలం వెళ్ళాలనే కోరిక కలిగింది. అదృష్టవశాత్తు 1927 సం॥లో కార్తీక దీపోత్సవానికి అరుణాచలం వెళ్తున్న ఒక బృందంతో ఆమెకు వెళ్ళే అవకాశం లభించింది. అక్కడే 40 రోజుల పాటు ఉండిపోయింది.

ఆ కొద్ది రోజుల్లోనే, ప్రతి దినమూ ఆమె ఎన్నోసార్లు రమణాశ్రమానికి వెళ్ళి అక్కడ రమణుల సన్నిధిలో ప్రశాంతంగా ఎక్కువ సమయం గడిపేది. ఒకసారి ఆమె భక్తి పారవశ్యంలో మునిగినప్పుడు సత్యమంగళం వెంకట్రామ అయ్యర్ 1910 సం॥లో విరూపాక్ష గుహలో వ్రాసిన 'రమణస్తుతి పంచకం' లోని ఒక పద్యాన్ని రమణుల సన్నిధిలో పాడింది. "ఓ! భగవాన్ నీ ఆధ్యాత్మిక వైభవం జగత్తునంతా నింపింది. దానితో అనేకులు ఆకర్షితులై వారి హృదయాలను నీ వైపుకు తిప్పారు. నేను కూడ నీ కోసం ఆతృతతో నీ కోసం వెతుక్కుంటూ వచ్చాను" అని ఆ పద్యం యొక్క భావన. ఇది ఆమె పరిస్థితికి చక్కగా సరిపోవడంతో ఆ పద్యాన్ని పాడుతూ అనుభూతి చెందారు. ఇది ఆమెకొక్కరికే కాదు, మనకందరికీ వర్తిస్తుంది అని చెప్పవచ్చు.

నలభై రోజులయ్యాక ఆమె అక్కడి నుంచి వెళ్ళిపోయే సమయాన బాగా దుఃఖిస్తున్న ఆమెకు 'ఉపదేశసారం' అనే గ్రంథాన్ని ఇస్తూ, భగవాన్ "ఏడవ వద్దు, మీరు అరుణాచలాన్ని వీడడం లేదు. త్వరలోనే తిరిగి వస్తారు" అని అన్నారు. అటు తరువాత భగవాన్ అనుగ్రహంతో 1928 సం॥లో ఆశ్రమానికి



వచ్చేసి, అప్పటినుండీ భగవాన్‌కు వండిపెడుతూ చివరి వరకు ఆశ్రమంలోనే ఉన్నారు.

భగవాన్ అద్భుతమయిన పాకశాస్త్ర ప్రవీణులే గాక తమ భక్తుల అహంకారాలను వండి అరుణాచలునికి నివేదిస్తారు. రోజువారీ వంట పనుల్లో ఆధ్యాత్మిక బోధను మిళితం చేసి వంటవారి జ్ఞానామృతాన్ని పంచుతారు. ఒకసారి భగవాన్, శాంతమ్మాళ్ వంటగదిలో వండుతున్నారు. భగవాన్ కూరను అదే పనిగా కలియబెడుతూ ఒక్కసారి ఆపి, ఆమె వైపు చూడటంతో ఆమె వెంటనే నిశ్చలంగా అయిపోయారు. అంటే, ఏ మాత్రం పరిసర జ్ఞానం కూడ లేకుండ అమితమైన ఆనందంతో, ప్రశాంత మైన శుద్ధ సంతోష స్థితిలో అలానే ఉండిపోయారు. కొద్దిసేపటి తరువాత భగవాన్ అటూ, ఇటూ నడుస్తుండగా, ఆమె ఈ లోకం లోనికి వచ్చారు. అప్పుడు భగవాన్ కూర వంక చూస్తూ, "ఇది పూర్తిగా ఉడికి, శబ్దం రాకుండ పోయింది. ఇప్పుడు మీరు సుగంధ ద్రవ్యాలను కలుపవచ్చు" అని అన్నారు. అంటే, మనస్సును నిశ్శబ్ద స్థితిలో నిలిపి దానికి వివేకమనే సుగంధ ద్రవ్యాన్ని కలపాలని ఆమె అర్థం చేసుకుంది.

మరొకసారి ఆమె అప్పుడే ఏదో ఒక వంటకాన్ని వండడం పూర్తి చేశారు. ఆ సమయంలో వంటగదిలోకి వచ్చిన భగవాన్‌ను ఆ వంటకాన్ని రుచి చూడవలసిందిగా ఆమె కోరారు. అప్పుడు భగవాన్ ఆమెతో సరదాగా, "మీకు తెలుసా, రాజులు వంటకాలను రుచి చూడడానికి కొందరిని నియమించి వారికి భారీ జీతాలను

ముట్ట జెప్పేవారు. మీరు నాకేమి జీతం ఇస్తారు?" అని అన్నారు. బదులుగా ఆమె "భగవాన్, నేను ఒక యాచకురాలిని. నేను నన్ను మాత్రమే అంకితం ఇవ్వగలను" అని అన్నారు. ఈ శరణాగతిని భగవాన్ హృదయపూర్వకగా ఆమోదించారు. భోజనాన్ని వడ్డించే ముందు ఆహార పదార్థాలనన్నింటినీ భగవాన్ రుచి చూసేవారు. అందుకే, భోజనం మొత్తం పవిత్రంగా మారేది.

చక్కని పాకశాస్త్ర ప్రవీణురాలు మాత్రమే గాకుండ భగవాన్ పట్ల చాలా ప్రగాఢమైన విశ్వాసం గల స్త్రీ శాంతమ్మాళ్. ఒకరోజు ఒక పెద్ద పాత్రలో సాంబారు మరుగుతోంది. అప్పుడే అటుగా వచ్చిన భగవాన్ దాన్ని చూసి దింపమని శాంతమ్మాళ్కు చెప్పి వెళ్ళిపోయారు. ఆ పాత్రను దింపడానికి కనీసం ముగ్గురు మనుషులు కావాలి. అలాంటది ఆమె తాను ఒక్కరే దింపి పక్కన పెట్టారు. ఆ తరువాత తన పనికి తానే ఆశ్చర్యపోయి "ఇది భగవాన్చే చేయబడ్డ అద్భుతం" అని ఆమె అన్నారు. మరి అంత ప్రగాఢమైన విశ్వాసం కల స్త్రీ ఆవిడ.

ఆమె అక్కడ వుండే సాధువుల పట్ల దయతో వుండి, వాళ్ళకు సహాయకారిగా వుండేవారు. ఆశ్రమంలో తయారు చేయబడ్డ రుచికరమైన పదార్థాలను వారికి పంపుతుండేవారు. ఇదంతా భగవాన్కు చెప్పి చేస్తుండేది.

"ఎవరు మోక్షాన్ని కోరుకుంటున్నారు? ఎవరికి ముక్తి కావాలి? అంతరంగంలోనికి తిరిగి ఆత్మవిచారణ చేయాలి. నిశ్చలత్వమే సత్యం. తమకు తాము సమర్పించుకుని అహంకారాన్ని శాశ్వతంగా వదిలినవాడు ఎంత దూరంలో ఉన్నా, గురువు వాని విషయమై



సంతోషపడటమే కాకుండ వాని పట్ల శ్రద్ధ వహిస్తాడు". ఇలాంటి ఎన్నో సంగతులను ఆమె భగవాన్ వద్ద నుంచి విని శ్రద్ధగా వ్రాసి పెట్టింది కాబట్టి ఇటువంటి వివరాలు సాధకులమైన మనకు ఇప్పటికీ లభ్యమవుతున్నాయి.

ప్రఖ్యాతిగాంచిన తెలుగు రచయిత గుడిపాటి వెంకటచలం గారు ఆశ్రమంలోని వంటగది గాథలు సేకరించారు కాబట్టి ఇవాళ మనం రమణాశ్రమంలోని వంటవారిని గౌరవంగా తలచుకునే అవకాశం కలిగింది.

శాంతమ్మాళ్ వృద్ధురాలైన పిదప ఆశ్రమానికి భారంగా వుండడం ఇష్టం లేక ఆశ్రమాన్ని వదిలి వెళ్ళాలని అనుకున్నారు. ఆ రాత్రి భగవాన్ ఆమెకు స్వప్నంలో కనిపించి "ఎక్కడికి వెళ్తారు? మిమ్మల్ని ఎవరు కనిపెట్టుకుని ఉంటారు?" అని అన్నారు. తామే ఆమెను కనిపెట్టి ఉంటానని భగవాన్ ఆమెతో పరోక్షంగా చెప్పారన్న మాట. అంతే, ఇక ఆమె ఏమీ ఆలోచించకుండ తమ చివరి రోజుల వరకూ ఆశ్రమంలో ప్రశాంతంగా గడిపారు.

(ఆధారం: శ్రీరమణ పెరియ పురాణం)

**"నేను" అనే దానికి తావు తల కానేరదు. నిద్ర వచ్చినప్పుడు తల ఒరుగుతుంది. తిరిగి మెలకువ వచ్చినప్పుడు లేస్తుంది. 'నేను' అనేది ఎప్పుడూ వుండేది. కనుక ఒకప్పుడు ఒరిగి ఒకప్పుడు లేచే తల దానికి తావు కానేరదు.**

# శూన్యం నుంచి సృష్టి

- ధూళిపాళ చంద్రశేఖర శాస్త్రి

అసాధారణములుగా కనుపించే మహిమలు, సిద్ధులు అలాగే సాధారణములైన సంఘటనల మధ్య పోలిక ఒకటి. ఆ రెండూ మనో నిర్మితాలు కావటమే. మహిమలను ప్రదర్శించే మంత్రదండం మనస్సే. ఈ మంత్ర దండం శూన్యంలో నుండి సృష్టిని చేయగలదు. ఇలాంటి శక్తి 4 దశల మనో నియంత్రణ ద్వారా సాధ్యము.

నిరోధము, నిబంధనము, నిది ధ్యానము, నిర్విషయత్వము అనేవి ఆ 4 దశలు.

**నిరోధము:** విషయముల నుండి మనస్సును వెనుకకు మరల్చుటయే నిరోధము. అంటే విషయము నుండి మనస్సును వేరు చేయడం. అది చేయడం ఎలాగ?

ఒక ఆలోచన జరుగుతున్నప్పుడు, నీవు ఆ ఆలోచనతో కలిసి పోతావు. అక్కడ నీవుండవు, ఆలోచనే ఉంటుంది. ఇది అప్రయత్నంగా, నీ ప్రమేయం లేకుండా నిరంతరం జరుగుతూ ఉంటుంది. నిరోధము అంటే 'ఇది ఫలానా ఆలోచన' అని దానిని గూర్చిన స్పృహగా నిలిచియుండడం. నీవు ఒక ఆలోచనను గుర్తించావు అంటే దాని నుండి నీవు విడిగా ఉంటేనే అది సాధ్య పడింది. ఆ ఆలోచనతో కలసిపోతే అది సాధ్యం కాదు. ఈ ప్రథమ దశలో ఆలోచనలను గుర్తించే స్పృహగా ఉంటూ ఉండటమే క్రమంగా జరుగుతూ ఉంటుంది. ఇక రెండవ దశ.



**నిబంధనము:** మొదటి దశ తమంతట తామే వచ్చే ఆలోచనల ఎడల స్పృహ కలిగి ఉండటమే అయితే, నిబంధన దశలో నీవు సంకల్పించి నీ ప్రయత్నంతో ఒక విషయాన్ని ఎంచుకొని దానిని గూర్చిన ఆలోచనలో ఉంటావు. అంటే మొదటి దశలోవలె గాక ఇక్కడ నీ ఆలోచన నీ సంకల్పాల యొక్క అధీనమైన విషయాన్ని గూర్చియే అయి ఉంటుంది. అలాంటి నీ సంకల్పము విషయమును ఎంచుకొని, దానిని దాటి ఆలోచన ఇతర విషయాల పైకి పోకుండా తన పరిధిలో బంధించి ఉంచుతుంది. నీ ఊహాశక్తి, సంకల్ప శక్తులను ఉపయోగించి నీవు ఎంచుకొనే వస్తువు, హృదయములో వెలిగే సహస్రదళ పద్మముగాని లేక శిరస్సునకు కొంచెము పైన ప్రకాశించే ఒక కాంతి పుంజము గాని వీటిలో ఏదో ఒకట కావచ్చును.

**నిదిధ్యానము:** నిబంధన దశలో నీవెంచుకున్న వస్తువు గాక ఇతరములైన ఆలోచనలు నిరాకరించబడి మనసు యొక్క చలనము ఆ నిబంధనకు లోబడి జరుగుతూ ఉంటుంది. సంకల్పముచే ఏర్పడిన ఇతర విషయాల నిరాకరణ, ఎంచుకొన్న విషయము పట్ల స్పృహ ఎంతో కాలము నిలిచియుండే స్థితియే నిదిధ్యాన దశ. ఇక్కడ దీర్ఘకాలము నీ సంకల్పాధీనమైన విషయ వస్తువు ఒకటే ఉంటుంది. అంతర్లీనంగా సంకల్పముంటుంది.

**నిర్విషయత్వము:** ఈ చివరి దశలో సంకల్పాన్ని అనుసరించి ఎంచుకొనబడిన విషయవస్తువు కూడ మాయమై, కేవలము స్పృహ మాత్రమే మిగిలి ఉంటుంది. ఇంతేగాక ఎలాంటి సంకల్పమూ లేకుండా, కేవలము సంకల్పశక్తి మాత్రము

ఉంటుంది. ఈ సంకల్పశక్తి నిద్రాణ దశలో కాకుండా జాగృతముగా ఉంటుంది. అంటే అవసరమైనప్పుడు పనిజేయటానికి కదల డానికి సిద్ధంగా ఉన్న కారు లాగ ఉంటుంది.

ఇక విషయ వస్తువు మాయమై పోవటం దానంతట అదే జరుగుతుంది. నీవు చేయాల్సిందేమీ లేదు. అది ఎలాంటి ప్రత్యేక సాధన వల్ల కాదు. మూడవ దశయైన నిదిధ్యానములో నుంచే ఇట్టి నిర్విషయత వస్తోంది. ఎలాంటి అనుభవమైనా, సాధారణ మైనది లేక అసాధారణము అనేది కూడ, విషయ వస్తువు మరియు దాని గురించి స్ఫృహలు రెండూ కలిస్తేనే జరుగుతుంది. మామూలుగా ఇవి రెండు ఉన్నాయని మనకు తెలియదు. అవి కలిసి ఉన్నాయనుకొనే మన అనుభవం నిజం కాదని ఈ సాధన ద్వారా తెలుస్తుంది. ప్రాథమిక, మాధ్యమిక సాధనాకాలాలలో నీవు కొంతసేపు విషయముగాను, కొంతసేపు స్ఫృహగానూ అటూ ఇటూ మారుతూ ఉంటావు. తరువాత ఎప్పుడు ఎక్కువ కాలం కేవల స్ఫృహగా నిలిచిపోవటం జరుగుతూ ఉంటుందో, అంటే నిదిధ్యానము పరిపక్వమైనప్పుడు, పరిమితులు లేని కేవల స్ఫృహ పరిమితమైన విషయవస్తువును మ్రింగివేస్తుంది. అంటే వస్తువు స్ఫృహలో కరిగిపోతుంది.

ఇప్పుడు సాధకుని స్థానంలో, సర్వసన్నద్ధంగా ఉన్న సంకల్ప శక్తి సర్వవ్యాప్త చైతన్యము (కేవల స్ఫృహ) మిగులుతాయి. అట్టి పరిమితులు లేని చైతన్యము, సంకల్పాన్ని బట్టి ఎటువంటి పరిమితమైన దృశ్యములనైనా సృష్టించగలదు. సాధరణులు వీటినే సిద్ధులు, మహిమలు అని అంటున్నారు.



మోక్ష సాధన ప్రక్రియలో వీటి స్థానం ఏమిటి? ఈ ప్రశ్న ఎందుకు వేస్తున్నామంటే ముక్త పురుషులనబడే వారి చరిత్రలలో వారి ద్వారా అనేక మహిమలు వ్యక్తం కావటము సాధారణంగా మనకు తెలుస్తోంది. సిద్ధులు పొందిన తరువాతనే జ్ఞానప్రాప్తియా? అనే ప్రశ్నకు శ్రీదేవికాలోత్తరములో పరమశివుడు ఇట్ల సమాధానం చెప్తున్నారు.

"అణిమాది గుణావాప్తిః జాయతాం వా న జాయతామ్ ।

తథాపి ముచ్యతే దేహీ పతిం విజ్ఞాయ నిర్మలమ్ ॥"

"అణిమాది అష్టసిద్ధులు తాను ప్రకటించగలిగినా, ప్రకటించ లేకపోయినప్పటికి నిర్మలమైన ఈశ్వర దర్శనం వలన జీవి ముక్తుడగుచున్నాడు". "అట్టి సిద్ధులు రావడం, రాకపోవడం అనేది వారి వారి యోగం బట్టి కూడ ఉంటుంది", అని భగవాన్ శ్రీరమణులు సెలవిచ్చారు. వాటికి ప్రాధాన్యత ఇవ్వరాదని, సిద్ధులను గూర్చి విస్తారముగా ప్రస్తావించిన పతంజలి మహర్షి కూడ అంటున్నారు.

"తద్వైరాగ్యాదపి దోషబీజక్షయే కైవల్యమ్"

"సిద్ధులను నిరాకరిస్తే దోషములు హరింపబడి కైవల్యానికి దారి తీస్తుంది" ఇట్టి శక్తులు లభించడం, లభించకపోవడం అనేది సాధకుని చేతిలో లేదు. అందువలన, సాధనామార్గంలో నాలుగవ దశయైన నిర్విషయలాకు చేరిన సాధకుడు, అలాంటి సర్వోత్కృష్ట స్థితికి చేరిన యోగి, తన సంకల్పశక్తిని ఆత్మవిచారణపై కేంద్రీకరించి, జ్ఞాని అవుతున్నాడు.

నిర్విషయ స్థితిలో కేవల స్పృహగా నిలచిన రూపరహిత సంకల్ప స్థితి, సంకల్ప శూన్యమైన తన ఉత్పత్తి స్థానము వైపు తిరిగినప్పుడు నిర్విషయతకు ఆవల ఉండే కైవల్యమనెడి, స్వస్వరూప దర్శనం జరుగుతుంది. ఇట్టి సాధననే బుద్ధ భగవానులు 'చింతలు లేని నిరీక్షణ' అన్నారు. తద్వారా అలాంటి మహాశూన్య స్థితిని అందుకొన్న సాధకుడు, యథేచ్ఛగా శూన్యం లోంచి సృష్టి చేయగల సామర్థ్యము లభించినప్పటికి, మహా శూన్యము వలె నిర్లిప్తంగా సచ్చిందానంద స్వరూపముగా భాసిస్తారు. అరమరికలు లేని ప్రయత్న మొకటియే సాధకుని చేతిలో ఉన్నది.

*నిరాడంబరులు మరియు వినమ్రులు అయిన శ్రీ భగవాన్ భక్తులు శ్రీ పి. కమలాకర్ గారు 1.1.2019 రోజున శివైక్యము చెందారని తెలియచేయుటకు చింతిస్తున్నాము.*

*శ్రీ భగవాన్ భక్తుల కుటుంబము నుండి వచ్చిన శ్రీ కమలాకర్ గారి తండ్రిగారు స్వర్గీయ పి.ఆర్. సుబ్బారావు గారు మరియు తల్లిగారు శ్రీమతి రాధమ్మ.*

*శ్రీ పి. కమలాకర్‌గారు శ్రీ రమణకేంద్రానికి 2010-11 సంవత్సరములలో కోశాధికారిగా వ్యవహరించారు. భక్తులందరు వారి చిరునవ్వును మరియు మృదువైన నడవడిని ఎలప్పుడు తలచుకొందురు.*

*శ్రీ భగవాన్ పాదముల వద్ద వారి ఆత్మకు శాంతి లభించాలని ప్రార్థించెదము.*



# రమణ గీతం

యనమండ్ర సంధ్యాదేవి

పల్లవి: రమణ రమణ అంటేనే చాలదా
శ్రీరమణ రమణ అంటేనే చాలదా.
సంశయములు తీరగా, వేదనల్ మాయగా
రమణ రమణ అంటేనే చాలదా.
శ్రీరమణా! భవహరణా ॥శ్రీరమణా॥

చరణం: నారాయణ మంత్రమే రమణ నామముగా
పరమేశ్వర తత్వమే రమణ తేజముగా
॥శ్రీమన్నారాయణ॥
నామరూపాల, భేదభావాలకు అతీతమై
వెలుగొందే పరబ్రహ్మ స్వరూపమే
రమణులుగా శ్రీరమణులుగా ॥శ్రీరమణ॥

2. అవధిలేని భవజలధిని దాటించే నావ
అది శ్రీరమణుని స్మరణమే నడిపించును త్రోవ ॥అవధి॥
చిత్తవృత్తి అణగగా, ఆత్మానంద మెందగా
ఏ తపము చేయకనే రమణ రమణ
అంటేనే చాలదా శ్రీరమణ శ్రీరమణ అంటేనే చాలదా
॥శ్రీరమణ భవహరణా॥

3. అజ్ఞానమే ఆవరించు మానసములో
అభయమిచ్చిదరిజేర్చే మహా మంత్రముగా ॥అజ్ఞానమే॥
జన్మజన్మల, కర్మబంధాలు నశియింప
రమణ రమణ అంటేనే చాలదా ॥రమణ॥
శ్రీరమణ భవహరణా ॥శ్రీరమణ॥

# నమ్మకం - విశ్వాసం

(మౌంటెన్‌పాత్ అక్టోబర్-డిసెంబర్, 2011 (సంపుటి 48, సంచిక-4) లోని సంపాదకీయం నుండి ఎన్నుకొనబడిన భాగాల అనువాదం)

- డా. వి. రామదాస్ మూర్తి

ఆత్మసాక్షాత్కారానికి అవసరమైన నమ్మకం, వేదాంత గ్రంథాలు, గురువాక్యాలలోని సత్యాన్ని గుర్తించడం ద్వారా ఏర్పడుతుంది.

వేలకొద్ది సంవత్సరాల నుండి కూడ ఏ మార్పు చెందని తేనెటీగను ఉదాహరణగా తీసుకుందాం. అది కూడబెట్టే తేనె, మైనం వల్ల తేనెటీగను ఎంతో విలువైనదిగా భావిస్తాము. అదొక్కటే కాదు పువ్వులలో పరస్పర పుప్పొడి మార్పుడల చేయడం ద్వారా మానవాళికి, ప్రాకృతిక ప్రపంచానికి ఎంతో కీలకమైన మేలు చేయడం వల్ల తేనెటీగ ప్రాముఖ్యత మరింత ఎక్కువైంది. అలాగ పుప్పొడిని మార్చే కీటకం తేనెటీగ ఒక్కటే కాదు. కాని ఈ విషయంలో అతి ప్రముఖమైన కీటకంగా తేనెటీగను గుర్తించ డానికి కారణం ఏమిటంటే, ఈ అన్వేషణలో తేనెటీగ ఒకే రకమైన పుష్పానికి పరిమితం కావడం. ఆ జాతి పుష్పం పట్ల అది అమిత మైన విశ్వాసపాత్రతను ప్రదర్శిస్తుంది. ఒక రకానికి చెందిన పుష్పం యొక్క పుప్పొడి అదే రకానికి చెందిన పుష్పాలలోని పుప్పొడితో కలిసినప్పుడు మాత్రమే ఫలదీకరణ జరుగుతుంది. అందుకే ఈ దృష్టితో గమనించినప్పుడు తేనెటీగ ప్రత్యేకత బయటపడుతుంది. తక్కిన ఎన్నో కీటకాలు పలు రకాల పుష్పాల నుండి యథేచ్ఛగా పుప్పొడి గ్రహిస్తుంటాయి. కాని అందువల్ల పుష్పాలలో ఫలదీకరణ జరిగే అవకాశం తక్కువ. తేనెటీగలో మనం గమనించే ఈ ప్రత్యేక లక్షణం లేకుంటే మన మనుగడకు అవసరమైన ఎన్నో పళ్ళు, కూరగాయలు ఉత్పత్తి సాధ్యపడదు. అంటే తేనెటీగ లేకుంటే ప్రపంచం ఎంతో నష్టపోయేదన్న మాట.

భగవాన్ జీవితంలో మనకు అమితమైన విశ్వాసపాత్రత వ్యక్త మవుతుంది. అరుణాచలం పట్ల ఆయన యొక్క అవిభక్తమైన భక్తి మనకు కొట్టొచ్చినట్లు తెలియవస్తుంది. ఆ నిబద్ధత యొక్క ఫలితాలు ఆయన వారసత్వంగా మిగిల్చిన భక్తులలో దర్శనమిస్తాయి. భగవాన్ యొక్క ప్రేమామృతమనే తేనెను రుచి చూచిన భక్తులు గాఢ విశ్వసనీయతతో ఆయన సూచించిన మార్గాన్నే అంటిపెట్టుకుని వుంటారు. ఒక గట్టి నమ్మకం యొక్క క్రియాత్మక రూపమే విశ్వసనీయత. మనలో అందరికీ ఏదో ఒక వ్యక్తి, వస్తువు, సంప్రదాయం, లేదా సూత్రం పట్ల అభిమానం, నమ్మకం వుండి వుంటుంది. దానికి అనుగుణంగానే మన మాటలు, చేతలు, మన దృఢమైన అభిప్రాయాన్ని తెలియజేస్తాయి. ఒక చోట బావి త్రవ్వాలన్న కృత నిశ్చయానికి వచ్చిన తరువాత ఇంకా ఆ చుట్టు ప్రక్కలంతటా చాలీ, చాలని నీళ్ళు పడే గుంటలు త్రవ్వడం కంటే, అసలు అనుకున్న చోటనే లోతుగా త్రవ్వడమే మంచిదన్న సామెత ఒకటుంది. ఆలోచించి తీసుకున్న నిర్ణయం పట్ల నమ్మకం బాగా కుదురుతుంది. కాని ఆ ప్రక్రియలో సరియైన విచక్షణ చూపించని పక్షంలో అది అవిశ్వాసానికి దారితీస్తుంది.

భగవాన్ రమణ, అరుణాచలం విషయానికి వస్తే మన దప్పికను తీర్చడానికి అవసరమైన ఆ దైవిక జల (అమృత) ధార ఒక వనరు నుండి మాత్రమే లభిస్తుందని భావించడం కుదరదు. ఎన్నో అసలు సిసలైన సంప్రదాయాలు కూడ సరియైన మార్గంలో అనుసరిస్తే మనలో పరివర్తన తెచ్చి అజ్ఞాన శృంఖలాల నుండి విముక్తులను చేయగలవు. అలాంటి ఇతర సంప్రదాయాల ఉనికిని గుర్తించకపోవడం మూర్ఖత్వమే గాకుండ గర్వపూరిత ధోరణిగా పరిగణించవలసి వస్తుంది. సత్యాన్వేషణలో మునిగి వున్న సాధకులెందరున్నారో, అన్ని మార్గాలూ వున్నాయని గ్రహించాలి. దైవవశాత్తు మనం రమణ-అరుణాచల పరిధిలోనికి ఆకర్షితులు కావడం జరిగింది. అరుణాచలం యొక్క పిలుపును అందుకుని ప్రతిస్పందించడం మన ప్రారబ్ధ ఫలితంగా జరిగిందని భావించాలి. చెక్కు చెదరని విశ్వాసంతో ఒకే మార్గంలో 'ఏకభక్తి'ని ప్రదర్శించిన మహర్షి పతాక గుణాన్ని అనుసరించి మసలుకోవడం మన విధి.

మనకు ఏది సరియైన మార్గమో, ఏది ఫలితాన్నిస్తుందో నిర్ణయించుకుని దాన్ని ఎన్నుకొనడం మనం చేయాల్సిన మొదటి చర్య. మన విచక్షణాసామర్థ్యాన్ని బట్టి ఎన్నుకున్నదానిపై గట్టి నమ్మకం వుంచాలి. కొన్ని పరిస్థితుల్లో మన ఎన్నిక తప్పై ఎన్నుకున్న మార్గం తగినది కాదని గుర్తించడం కూడ జరుగుతుంది. అలా పొరబాటును తెలుసుకున్న తరువాత తిరిగి మార్గాన్వేషణ మొదలుపెట్టాలి.



తప్పుడు నమ్మకాల ఆధారంగా మొదలుపెట్టబడిన చర్యలు చరిత్రలో మనకు ఎన్నో కనిపిస్తాయి. మన కుటుంబం లేదా స్నేహితులు, సంఘం, ఇలా వివిధ స్థాయిలలో అలాంటప్పుడు అసంతృప్తికి కారణమవుతాయి. పసిఫిక్ మహాసముద్రంలోని ఈస్టర్ ద్వీపవాసులు ఎదుర్కొన్న పరిస్థితి దీనికి సరియైన ఉదాహరణ. పరిమాణపరంగా అతి తక్కువ జనాభా వున్న ఆ సమాజం ఒక దశలో తమ సంఘశ్రేయస్సుకు సముద్రతీరం వెంబడి అతి పెద్దవైన కొన్ని దేవతా విగ్రహాలను నిలబెట్టాలన్న గట్టి నమ్మకాన్ని ఏర్పరచుకున్నారు. చెట్లు నరికి, నేల త్రవ్వి అగ్ని పర్వతపు లావా ద్వారా ఏర్పడిన 'బసాల్ట్' బండలను బోలెడంత శ్రమ, సమయాన్ని వెచ్చించి సముద్రతీరానికి చేర్చారు. అక్కడ విగ్రహాలను చెక్కి, ప్రతిష్ఠించారు. ఈ ప్రణాళిక కారణంగా అతి చిన్నదైన ఆ ద్వీపంలో కలప కొరత ఏర్పడింది. ఇళ్ళ నిర్మాణం, ప్రధానంగా మత్స్యకారులైన వారి జీవనాధారానికి అవసరమైన పడవల తయారీ, రిపేరు పనులు అసాధ్యమైనాయి. త్రవ్వకాల వల్ల భూమిపై పొరలు నాశనమై, పళ్ళు, కూరగాయల ఉత్పత్తి వీలుకాని పరిస్థితి ఏర్పడింది. ప్రజలు దీవి నుండి వలసపోయారు లేదా కరువు పరిస్థితుల్లో చనిపోయారు. ఎంతో కొంతమేరకు మన మందరం కూడ ఆ క్షణంలో సరియైనదన్న నమ్మకం మంచి ఫలితాలనిస్తుందనే తప్పుడు అభిప్రాయంతో, శ్రమ, సమయాలను వృథా చేసుకున్న వారమే!

(సశేషం)

## The Wisdom of Bhaja Govindam

Dr. K. Subrahmanian (Talk 3A)

We all think that successful people are those who don't have any problems, but it is not so. Those who appear to be successful on the surface are actually miserable. They are constantly worried whether they will retain their position, their money, etc. Adi Sankara's *Bhaja Govindam* contains beautiful verses that are meant for worldly people. He warns that things we are proud of in life like wealth, youth, etc., give us a false sense of security.

*Maa kuru dhana jana youvana garvam;*
*harati nimeshaat kaalah sarvam*
*maaya mayamidam akhilam hitva*
*Brahma-padam tvam pravisa viditva* (Verse 11)

What are we proud of in our lives? *Dhana* or wealth is one of the things. If you are wealthy, you expect that you will be surrounded by people - *jana*. Even people in power will come to you because they need your money for winning in the elections. So, money has its own power; one can control others with money. But can affection or love be bought with money? In fact, you find that people will not even be grateful; they will say, "He is worth many crores of rupees, but he gave me only a paltry sum!" Nobody is satisfied with the money you give. On the other hand, if food is given, you have good chances of satisfying him. Beyond a point, one refuses to eat since the body cannot take it. When asked why he accepted food from others, but not money, Bhagavan would say, "I can eat food, but I can't eat money!" So, he never used to touch money.



Sankara says in this verse, "Don't think that you have a lot of friends and relatives and can get along in life with their help." Exactly at a time when you need them, they won't be available. Only if there is the Grace of the Lord, can you be successful. If you have it, then even without these people, you can tackle life's problems. Sankara further says, '*Youvana'* or youth is another thing we are proud of. We think youthfulness and the consequent bodily strength will help us conquer the entire world, make us successful, and so on. He says *yama* or Death will remove all the three - *dhana, jana, youvana* - in a second. We do not know when he will come; therefore, don't be proud of these! He concludes by saying, *Maaya maya*m *idam akhilam hitva, Brahma padam tvam pravisa viditva*. All these worldly things are mere illusion; go beyond them, and try to reach the Abode of the Supreme. Don't think that these will give you peace of mind. Only service to the Lord will give you peace of mind.

*artham-anartham bhaavaya nityam naasti*
*tatah sukha lesas satyam*
*puttraadapi dhana bhaajam bheetih*
*sarvatraisha vihita reetih* (Verse 29)

These words appear to be so simple, but you can see how profound they are. Sankara says, *artham, anartham bhaavaya nityam:* look upon wealth *(artham)* as unhealthy *(anartham)*. *Naasti tatah sukha-lesa*. There is not an iota of happiness in wealth; only doing a lot of good with your money, without expecting anything in return, will give you lasting happiness. If you think that because of your money,

you're going to have this and that, you're going to be mistaken. This is the truth *(satyam)* says Sankara. Beyond a particular limit, he continues, *putraadapi dhana bhaajam bheetih* - this money will give you a lot of trouble. Not only trouble from outside. *Putraadapi* …… your own children will create lots of problems and tremendous fear for you because of your money. All the time, you will be worried because, if you say this is ancestral property, your children might want a share of it; and if you say it is self-earned, all kinds of disputes will be there. Sankara says this is the problem for the entire world - *sarvatraisha vihita reetih*.

Having said that, Sankara does not say, "Don't earn money, everybody should go and ask for bhiksha". He does not recommend ceasing all worldly activities. He says in another verse:

*Moodha jaheehi dhanaagama trishnaam*
*kuru sadbuddhim manasi vithrushnaam*
*Yallabhase nija karmopattam vittam tena*
*vinodaya chittam* (Verse 2)

